సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 31 । మే । 2024



పంచామృతాభిషేకం

విశాఖ: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం వైభవంగా జరిపారు.



స్నపన తిరుమంజనం

విశాఖ: రుషికొండలోని టీటీడీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం

38.3/29.0

వాతావరణం

గరిష్ట ఉష్ణోగ్రతలు 2–4 డిగ్రీలు పెరుగుతాయి. ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

ఆ రెండు కిలోమీటర్లు డ్రోన్లపై నిషేధం



ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల చుట్టు పక్కల రెండు కిలోమీటర్ల వరకు రెడ్ జోన్‌గా ప్రకటించినట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈవో ముఖేష్ కుమార్ మీనా, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు స్ట్రాంగ్ రూమ్‌ల చుట్టూ రెండు కిలోమీటర్ల మేర అనధికార డ్రోన్ కార్యకలాపాలను నిషేధించినట్లు వెల్లడించారు. రెడ్ జోన్ నిబంధనలు వెంటనే అమల్లోకి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఈ నిషేధం అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌లో స్వల్ప మార్పులు



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్

తుమ్మపాల: పాలిసెట్–2024 కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు జూన్ 7 నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. షెడ్యూల్‌లో స్వల్ప మార్పులున్నాయన్నారు. ఈ నెల 4న ఎన్నిక ఫలితాలకు సంబంధించి కౌంటింగ్ నిర్వహిస్తున్న కారణంగా.. 3వ తేదీ నుంచి మూడు రోజుల పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. దీంతో 3వ తేదీ నుంచి కౌన్సెలింగ్‌కు వచ్చేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో జూన్ 3న నిర్వహించాల్సిన ధ్రువీకరణపత్రాల పరిశీలన 6వ తేదీకి మార్చినట్లు వివరించారు. జూన్ 11 న ఆప్షన్ల మార్పిడి చేసుకోవచ్చన్నారు. గురువారం 43,001 నుంచి 59,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ కొనసాగింది. శుక్రవారం 59,001 నుంచి 75 వేల వరకు జరుగుతుంది.

గురుకులాల్లో ఇంటర్ మిగులు సీట్ల భర్తీ



స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థికి ధ్రువపత్రం అందజేస్తున్న సమన్వయకర్త రూపవతి

సబ్బవరం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి సబ్బవరం గురుకులంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని సబ్బవరం, దేవరాపల్లి, గొలుగొండ, శ్రీకృష్ణాపురం బాలుర గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు జిల్లా గురుకులాల సమన్వయకర్త, కౌన్సెలింగ్ చైర్మన్ రూపవతి తెలిపారు. బాలుర గురుకులాల్లో 108 సీట్లు ఖాళీగా ఉండగా.. కౌన్సెలింగ్‌కు 150 మంది హాజరయ్యారన్నారు. మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుగుణంగా 74 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించామన్నారు. గురుకులాల ప్రిన్సిపాళ్లు ఆర్.రామకృష్ణ, సీహెచ్ రవీంద్రనాథ్, వి.రత్నవల్లి తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌సీలో వెస్ట్రన్ నేవల్ చీఫ్



నేవల్ డాక్‌యార్డ్‌లో ప్రాజెక్టులను వివరిస్తున్న నేవీ సిబ్బంది

సింధియా (విశాఖ): విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్‌ను వెస్ట్రన్ నేవల్ కమాండర్ ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ జె సింగ్, అతని సతీమణి జరీన్ సింగ్ గురువారం సందర్శించారు. పర్యటనలో భాగంగా తూర్పు నౌకాదళ ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్‌తో వారు సమావేశమయ్యారు. కమాండ్‌లో పురోగతిలో ఉన్న వివిధ కార్యకలాపాలు, ప్రాజెక్టుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నేవల్ డాక్‌యార్డ్, మెటీరియల్ ఆర్గనైజేషన్, ఐఎన్ఎస్ ఎక్సిలా, ఐఎన్ఎస్ విశ్వకర్మ వద్ద ఉన్న సబ్‌మెరైన్ డ్యామేజ్ కంట్రోల్ తదితర ప్రాంతాలను సందర్శించారు.

పద్ధతిగా.. పారదర్శకంగా..





శిక్షణకు హాజరైన కౌంటింగ్ అసిస్టెంట్లు, సూపర్ వైజర్లు, మైక్రో అబ్జర్వర్లను ఉద్దేశంచి మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి

- పక్కాగా లెక్కింపు ప్రక్రియ నిర్వహణ
- నిబంధనలను తూచా తప్పక పాటించాలి
- తేడా గమనిస్తే ఆర్వో దృష్టిలో పెట్టండి
- కౌంటింగ్ అధికారులు, సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి దిశానిర్దేశం

సాక్షి, అనకాపల్లి: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం జరిగిన రెండో రోజు ఎన్నికల లెక్కింపు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జూన్ 4న జరిగే కౌంటింగ్ నిర్వహణపై అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. శంకరంలో గల ఫ్యూచర్ వరల్డ్ స్కూల్లో జిల్లా పరిధిలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు స్థానానికి లెక్కింపు జరుగుతుందన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికీ 14 టేబుళ్లు, పార్లమెంట్ స్థానానికి 14 టేబుళ్లు వేర్వేరుగా ఉంటాయన్నారు. ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ , మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్‌కు ముందుగా కంట్రోల్ యూనిట్ల (సీయూ)ను తీసుకువస్తారని, వీటిని తీసుకొచ్చే బృందానికి డ్రెస్ కోడ్ కూడా ఉంటుందన్నారు. వివిధ రాజకీయ పక్షాలకు చెందిన అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ తెరవాలని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలట్‌కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. ప్రతి టేబుల్ వద్ద వారికి కేటాయించిన కంట్రోల్ యూనిట్లు మాత్రమే చెక్ చేసి కౌంటింగ్ ప్రారంభించాలని సూచించారు.

ఓట్ల సంఖ్యను సరిచూసుకోవాలి

లెక్కించడానికి ముందు కంట్రోల్ యూనిట్లో నమోదైన మొత్తం ఓట్లు.. ఫారం–17(సి)లో నమోదైన ఓట్లు సరిచూసుకోవాలని, తేడా వస్తే వెంటనే సదరు కంట్రోల్ యూనిట్‌ను రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని కలెక్టర్ చెప్పారు. కంట్రోల్ యూనిట్లో క్లాక్ ఎర్రర్ వస్తే కొత్త బ్యాటరీ వేసి ఆన్ చేయాలని, అప్పటికీ క్లాక్ ఎర్రర్ వస్తే రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని తెలియజేశారు. కంట్రోల్ యూనిట్లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం 17 సీలో నమోదైన ఓట్లను సరిచూసుకొని, రిజల్ట్ బటన్ ప్రెస్ చేసి కౌంటింగ్ ఏజెంట్లకు ఫలితాలు చూపించి వాటిని నిర్దేశించిన నమూనాలో నమోదు చేయాలన్నారు. 14 టేబుళ్ల వద్ద కౌంటింగ్ పూర్తయిన తర్వాత.. ఆ రౌండ్ వివరాలు రిటర్నింగ్ అధికారి వెల్లడించిన తర్వాత మాత్రమే తదుపరి రౌండ్ కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. వీవీ ప్యాట్ స్లిప్పుల లెక్కింపు విషయంలో అప్రమత్తంగా ఉండాలని, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్లిప్పులను బ్లాక్ కవర్లలో భద్రపరిచి సీల్ చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని.. మొత్తం వీడియోలో చిత్రీకరించాలన్నారు. కౌంటింగ్ సమయంలో నియోజకవర్గ ఆర్వో అనుమతి లేకుండా ఏ ఒక్కరూ బయటికి వెళ్లకూడదని పేర్కొన్నారు. ఏజెంట్లు వారికి కేటాయించిన టేబుల్ వద్ద మాత్రమే ఉండాలని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలో ఎవరికీ సెల్ ఫోన్‌కు అనుమతి లేదని, తనిఖీ నిర్వహించిన తర్వాతే లోనికి అనుమతిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ జీఎం కె.జయంతి, డీఎల్‌డీవో నాగలక్ష్మి, డీఎల్‌పీవో కుమార్, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలు మొరాయించినా నో వర్రీ

సాంకేతిక లోపాలను నిమిషాల్లోనే పరిష్కరించనున్న భెల్ ఇంజినీర్లు

సాక్షి, అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. జిల్లాలోని ఆరు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు తగు ఏర్పాట్లు జిల్లా ఎన్నికల యంత్రాంగం సిద్ధం చేస్తోంది. కౌంటింగ్ సమయంలో ఈవీఎంలు మొరాయించినా ఇబ్బంది లేకుండా నిమిషాల్లోనే పరిష్కరించేలా భెల్ ఇంజినీర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. అనుకోని విధంగా సాంకేతిక సమస్యలు వస్తే అధికారులు, సిబ్బంది కంగారు పడొద్దని.. భెల్ ఇంజినీర్ల సహాయం తీసుకోవాలని సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి సిబ్బందికి సూచించారు. కౌంటింగ్ సమయంలో సిబ్బంది పొరపాట్లకు తావు లేకుండా ఎలక్షన్, కౌంటింగ్ అబ్జర్వర్లు, ఆర్వో, ఏఆర్వోలతో ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది.

ఆర్వోలదే తుది నిర్ణయం

- ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఈసీ మార్గదర్శకాలు
- ఏజెంట్ల సమక్షంలో తెరవనున్న స్ట్రాంగ్ రూంలు
- ఎన్‌కోర్ యాప్‌లో నమోదు తరువాతే ఫలితాల వెల్లడి



కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన టేబుల్స్



ఎన్‌కోర్ యాప్

విశాఖసిటీ: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగానే ఓట్ల లెక్కింపు ఫలితాలు ప్రకటించనున్నారు. కౌంటింగ్ అంశంపై ఈసీ పలు మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ఫలితాల ప్రకటనలో అధికారులు ఎవరూ సొంత నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేసింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయమే తుది నిర్ణయంగా భావించాలని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది.

3 నాటికి ఏర్పాట్లు పూర్తి

జూన్ 4వ తేదీన ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోగానే కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లు తెరవాల్సి ఉంటుంది. ఓట్ల లెక్కింపులో ఏవైనా సందేహాలు వచ్చినప్పుడు ఆర్‌వోలతో మాట్లాడి సందేహాలు నివృత్తి చేసుకోవాలి. కౌంటింగ్ ఏర్పాట్లన్నీ జూన్ 3వ తేదీకి పూర్తి చేసుకోవాలి. ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేయగా.. అక్కడే కేంద్ర పరిశీలకులతో పాటు కౌంటింగ్ సిబ్బంది ఉంటారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేక కుర్చీలు ఏర్పాటు చేస్తారు. ఏజెంట్లు తమకు కేటాయించిన టేబుళ్ల వద్దే ఉండాలి. పక్క టేబుల్ వద్దకు వెళ్లడానికి వీలులేదు. ఒకసారి కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చిన ఏజెంట్లు బయటకు వెళ్తే తిరిగి లోపలకు రావడానికి వీలుండదు. ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రాల్లోకి తీసుకురావడానికి సిబ్బందిని కేటాయిస్తారు. ఒక రౌండు పూర్తయ్యాకే మరో రౌండుకు సంబంధించి కంట్రోల్ యూనిట్లు తీసుకు రావాల్సి ఉంటుంది.

ఎన్‌కోర్ యాప్‌లో నమోదు తర్వాతే..

ఓట్ల లెక్కింపులో భాగంగా స్ట్రాంగ్ రూంలను కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలోనే తెరుస్తారు. ఈవీఎంలను నమోదు చేసుకునేందుకు స్ట్రాంగ్ రూమ్‌లో ఒక నోడల్ ఆఫీసర్ ఉంటారు. ఈవీఎంలను కౌంటింగ్ గదిలోకి తీసుకురాగానే వాటికి సీల్ సరిగా ఉందా లేదా అని పరిశీలిస్తారు. ఓట్ల లెక్కింపు పూర్తి కాగానే వివరాలను ఎన్‌కోర్ యాప్‌లో నమోదు చేసిన అనంతరం ఫలితాలను ఆయా నియోజకవర్గాల ఆర్వోలు వెల్లడిస్తారు. పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్ల లెక్కింపుకు ఒక ఏఆర్వో, కంప్యూటర్ అసిస్టెంట్, కంప్యూటర్ సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. కేంద్ర పరిశీలకులు కౌంటింగ్ ప్రక్రియ, ఫలితాల వెల్లడి, డిక్లరేషన్ వరకు దగ్గరుండి పరిశీలిస్తారు. కౌంటింగ్ పూర్తి కాగానే ఫలితాలను ప్రకటించి గెలుపొందిన అభ్యర్థికి ఫారం –21 అందజేస్తారు.

విద్యార్థులందరికీ పాఠ్య, నోటు పుస్తకాలు

డీఈవో వెంకటలక్ష్మమ్మ



పీఎస్‌పేట స్టాక్ పాయింట్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

చోడవరం రూరల్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గానూ విద్యార్థులందరికీ పంపిణీ చేయడానికి పాఠ్య పుస్తకాలతోపాటు నోట్ పుస్తకాలు సిద్ధంగా ఉంచినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. చోడవరం మండలం ఫకీర్ సాహెబ్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పుస్తకాల స్టాక్ పాయింట్‌ను గురువారం ఆమె సందర్శించారు. తరగతులు, అంశాలు వారీగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను చక్కగా అమర్చి ఉండడంపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. నోట్ పుస్తకాల నాణ్యత పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికల్లా.. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యానుసారం పుస్తకాల పంపిణీకి సిద్ధంగా ఉండాలని స్టాక్ పాయింట్ నిర్వాహకులకు ఆమె సూచించారు. చోడవరం మండలానికి ఇప్పటివరకు 33,067 పాఠ్యపుస్తకాలు, 34,532 నోట్ పుస్తకాలు పంపించినట్లు వెల్లడించారు. ఎంఈవో కె.సింహాచలం, హెచ్ఎం ఎన్.వి.ఎస్.ఎస్.శర్మ పాల్గొన్నారు.

సచివాలయాల్లో పారదర్శకంగా సేవలు

- రెండు పూటలా సిబ్బంది ఆన్‌లైన్ హాజరు తప్పనిసరి
- సచివాలయాల ఆకస్మిక తనిఖీలో డీఎల్‌డీవో మంజులవాణి



కాశీపురం సచివాలయంలో సిబ్బందిని ఆరా తీస్తున్న డీఎల్‌డీవో మంజులవాణి

దేవరాపల్లి: గ్రామ సచివాలయాల్లో ప్రజలకు పౌర సేవలన్నీ పారదర్శకంగా అందించాలని డీఎల్‌డీవో ఎస్.మంజులవాణి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. గురువారం ఆమె కాశీపురం, పెదనందిపల్లి, రైవాడ, మారేపల్లి గ్రామ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఆయా సచివాలయాల్లోని సిబ్బంది మూమెంట్ రికార్డులు, ఇతర సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలందించడంలో అలసత్వం వహించవద్దన్నారు. రోజూ రెండు పూటలూ ఆన్‌లైన్ హాజరు తప్పనిసరన్నారు. దేవరాపల్లి మండలంలో 65 మంది ఉద్యోగుల హాజరు నమోదు కానట్లుగా తమ పరిశీలనలో వెల్లడయిందన్నారు. హాజరు వెయ్యని వారిలో వీఆర్వోలు, సర్వేయర్లు అధికంగా ఉన్నట్లు తెలిపారు. వారితో పాటు ఏ ఉద్యోగి అయినా క్షేత్ర స్థాయిలో విధులకు వెళ్లాల్సి వస్తే సంబంధిత అధికారి ఆమోదాన్ని తీసుకోవాలన్నారు. లేని పక్షంలో సదరు ఉద్యోగి విధులకు గైర్హాజరైనట్లు పరిగణించాల్సి వస్తుందన్నారు. వేసవి ముగిశాక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

యువ పారిశ్రామికవేత్తలకు అవకాశాలు మెండు



యూబీఐ జోనల్ హెడ్ శాలిని మీనన్‌కు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

ఏయూ క్యాంపస్: స్వశక్తితో ఎదిగే యువ పారిశ్రామికవేత్తలకు అనేక అవకాశాలు ఉంటున్నాయని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్ శాలిని మీనన్ అన్నారు. గురువారం ఎంవీపీ కాలనీ గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో రోటరీ క్లబ్ విశాఖపట్నం 3020, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్, యూబీఐ సంయుక్తంగా యువ పారిశ్రామికవేత్తల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపార రంగంలో రాణించాలని ఆకాంక్షించే వారికి అనేక వేదికలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. ఎంఎస్ఎంఈల ద్వారా రుణాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రోటరీ క్లబ్ విశాఖపట్నం అధ్యక్షుడు ఆర్.టి.ఎస్.డి.మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు కల్పించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ జోనల్ వైస్ ప్రెసిడెంట్ లీలారాణి, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రమౌళి, ఎస్ఆర్‌డీసీ రీజినల్ మేనేజర్ బి.కె.సాహు, ఉపేంద్ర శ్రీనివాస్, రోటరీ క్లబ్ విశాఖపట్నం కార్యదర్శి పి.వి.రఘుపతి, పెద్ద సంఖ్యలో యువ పారిశ్రామికవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతా చనిపోయాడనుకున్నారు.. కానీ..

కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన వ్యక్తి



మే 2న చేరదీసిన సమయంలో గోపాల్ మైతీ



గోపాల్ మైతీని (నీలం రంగు టీ షర్టు) కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్

అల్లిపురం (విశాఖ): మూడేళ్ల కిందట ఆస్పత్రికి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. వెతికినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా జాడ లేకపోవడంతో చనిపోయాడని అంతా భావించారు. అయితే ఇక్కడే ట్విస్ట్ నెలకొంది. చనిపోయాడనుకున్న వ్యక్తి కొన్నేళ్ల తర్వాత సజీవంగా కళ్ల ముందు కనిపించడంతో ఆ కుటుంబం ఆనంద డోలికల్లో మునిగిపోయింది. బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత తెలిపిన వివరాలివీ.. ఈ నెల 2న సింధియాలో మతిస్థిమితం లేని వ్యక్తి తిరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ సిబ్బంది అక్కడకు వెళ్లారు. ఆయన్ని చినవాల్తేరు మానసిక చికిత్సాలయంలో చేర్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి సహకారంతో మెరుగైన చికిత్స అందజేయడంతో అతని ఆరోగ్యం మెరుగుపడింది. దీంతో తన వివరాలు తెలపగలిగాడు. తన పేరు గోపాల్ చంద్ర మైతీ అని, తనది పశ్చిమ బెంగాల్‌లోని ముక్సద్‌పూర్ అని చెప్పడంతో అక్కడి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందజేశారు. ఆ పోలీస్ స్టేషన్‌లో మూడేళ్ల కిందటే అతను తప్పిపోయినట్లు కేసు నమోదు కావడంతో.. పోలీసులు గోపాల్ కుటుంబ సభ్యులకు ఈ సమాచారం తెలిపారు. దీంతో అతని అన్నయ్య సుబ్రత మైతీ, చిన్నాన్న దేబ్‌దులాల్ మైతీ గురువారం నగరానికి చేరుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి, హెచ్‌వోడీ విజయలక్ష్మి, జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమతలు గోపాల్ మైతీని అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా మైతీ కుటుంబ సభ్యులు మమతతో పాటు ఆస్పత్రి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

పోర్టు పరిసరాల్లో 10 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

పోర్టులో ఘనంగా ప్రపంచ పర్యావరణ వారోత్సవాలు



మొక్క నాటుతున్న పోర్టు కార్యదర్శి వేణుగోపాల్, ఇతర అధికారులు

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీలో ప్రపంచ పర్యావరణ వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోర్టు చైర్మన్ డాక్టర్ ఎ.అంగముత్తు ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోర్టు కార్యదర్శి వేణుగోపాల్ ఆధ్వర్యంలో అధికారులు సీ హార్స్ జంక్షన్ నుంచి హెచ్ 7 కూడలి మధ్య మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పోర్టు సాధారణ పరిపాలన, ఆర్థిక విభాగం అధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రానున్న రోజుల్లో పోర్టు పరిసర ప్రాంతాల్లో 10 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించారు. కాలుష్య నివారణకు, పోర్టు పరిసరాల్లో గాలి, ధూళి, నీరు, ఇంధన కాలుష్యాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు పర్యావరణ పరిరక్షణలో అందరినీ భాగస్వాములను చేసే పలు కార్యక్రమాలకు పోర్టు అధికారులు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలను నిర్వహించనున్నారు.



• సందడిగా సాగరతీరం



ఎండ తీవ్రత, ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం నగర ప్రజలు సాగరతీరానికి చేరుకోవడంతో గురువారం సందడిగా మారింది. సాయంత్రం అధిక సంఖ్యలో వచ్చిన సందర్శకులతో కిటకిటలాడింది. చిన్నారులు, యువత చల్లని గాలులను ఆస్వాదిస్తూ.. స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు.

–బీచ్‌రోడ్డు(విశాఖ)

ప్రమాదవశాత్తూ జారిపడి వ్యక్తి మృతి


అంజనేయులు మృతదేహం

గొలుగొండ: ఏఎల్ పురం సమీపంలో జరుగుతున్న హైవే నిర్మాణ పనులకు వచ్చిన కూలీ ప్రమాదశాత్తూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కృష్ణదేవిపేట ఎస్‌ఐ ఉపేంద్ర తెలిపిన వివరాలు. తెలంగాణలోని పాతరచేడు గ్రామానికి చెందిన జోగు ఆంజనేయులు(37) హైవే పనుల కోసం ఇక్కడికి మంగళవారం వచ్చాడు. సమీప పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా కల్వర్టు వద్ద కాలుజారి పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇంకా పెళ్లి కాలేదు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఇంటర్ పరీక్షలకు 5,570 మంది హాజరు

తుమ్మపాల: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల(కెమిస్ట్రీ, కామర్స్)కు గురువారం 5,570 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్ విద్య జిల్లా అధికారి బి.సుజాత తెలిపారు. ఉదయం జరిగిన ఫస్టియర్ పరీక్షకు 4,657 మందికిగాను 4,282 మంది, మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షకు 1,395 మందిలో 1,288 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. జిల్లాలోని 20 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు.

నేడు ధూమపాన వ్యతిరేక దినం
స్మోకింగ్‌తో తోటివారి అనారోగ్యానికి కారణం కావొద్దు
సాధనతో దురలవాట్లకు దూరం కావొచ్చు

పొగ.. పగ





దాబాగార్డెన్స్(విశాఖ): పొగ.. పగ సాధిస్తోంది. సరదా.. సరదా సిగరెట్టు.. అనారోగ్యానికి తొలిమెట్టులా మారిపోయింది. ఎంత ఒత్తిడి నుంచైనా సిగరెట్, బీడీ, చుట్టలు ఉపశమనం కలిగిస్తాయని, అవి లేనిదే జీవితం లేదని గొప్పలు చెప్పే పొగరాయుళ్లు.. వైద్యులు చెప్పే విషయాలు చదివితే గుండె జారడం ఖాయం.

ధూమపానం వల్ల గుండెతో పాటు జేబుకూ చిల్లు తప్పదు. ఆ విషయం తెలుసుకునేలోపే సిగరెట్ పొగలాగే మన ప్రాణాలు కూడా గాల్లో కలిసిపోతాయనేది నిపుణుల మాట. సిగరెట్, గుట్కా, పాన్ మసాలా పేరు ఏదైనా.. పొగాకును ఏ రూపంలో సేవించినా ప్రమాదమే అంటున్నారు వైద్యులు. ఒక సిగరెట్‌లో నాలుగు వందలకు పైగా హానికర విష రసాయనాలుంటాయి. అందులో 48 కంటే ఎక్కువ క్యాన్సర్ కారకాలని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ కారకాలు ఊపిరితిత్తులు, గొంతు, నాలుక వంటి భాగాలకు క్యాన్సర్‌ను సులువుగా కలగజేస్తాయి. గర్భిణులు ధూమపానం చేస్తే గర్భస్థ శిశువు మృదు అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. ధూమపానం చేసే వ్యక్తి తనకు మాత్రమే కాకుండా తన చుట్టూ ఉండేవారి ఊపిరితిత్తుల్లో 25 శాతం విషవాయువును ఉచితంగా పంపుతూ వారి అనారోగ్యానికి కారణమవుతున్నాడు. దేశంలో దీని కారణంగానే ప్రతి రోజూ 2000 మంది చొప్పున.. ఏటా 8 లక్షల మంది మృత్యువాత పడుతున్నట్టు అంచనా. నానాటికీ మహమ్మారిగా మారుతున్న ఈ విషవాయివు అలవాటును తక్షణం మానేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెబుతున్నారు సామాజిక కార్యకర్తలు. దృఢసంకల్పంతో ఈ అలవాటును దూరం చేసుకోవడం పెద్ద విషయమేమీ కాదంటున్నారు వైద్యులు.

అనర్థాలివే..

గుట్కా తిన్నా, సిగరెట్ తాగినా, మద్యం సేవించినా క్యాన్సర్, గుండె, కిడ్నీ జబ్బులు, అల్సర్, దగ్గు, ఆయాసం, ఓపిక లేకపోవడం వంటి రోగాలకు దగ్గరవుతారు. మంచానికి పరిమితమవడంతో జీవితం కష్టాల పాలవుతుంది.

ఇలా చేయండి..

- మీకు ధూమపానం అలవాటు ఉంటే మీ వద్ద సిగరెట్, బీడీ, చుట్ట, గుట్కా వంటి వాటిని ఉంచుకోకండి.
- వాటిని తీసుకునే అలవాటు ఉన్న వ్యక్తుల నుంచి కొంత కాలం దూరంగా ఉండండి.
- పొగాకు సేవించడం సంపూర్ణంగా వదిలిన నాడే సంపూర్ణ ఆరోగ్యం పొందగలమనే నిజాన్ని మరువకండి.
- ధూమపానం చేయాలనిపించినప్పుడల్లా లవంగాలు, యాలకులు వంటి వాటిని తీసుకున్నట్టయితే తాత్కాలిక ఉపశమనం కలుగుతుంది.
- ఆరంభంలో నాలుగు వారాలు, ఆ తర్వాత 6 నెలల పాటు ఇటువంటి ప్రయత్నం చేసి నెమ్మదిగా ఈ దురలవాటు నుంచి శాశ్వత విముక్తి పొందవచ్చు.
- ఆధ్యాత్మిక జీవనాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా కూడా ధూమపానానికి దూరం కావచ్చు.
- మనశ్శాంతితో పాటు మనోబలం, సహనశక్తి, వృద్ధి అవుతాయని, తద్వారా వ్యసనాలపై అసహ్యం కలుగుతుందనేది మెడిటేషన్ కేంద్రాల వారి సూచన.
- పొగాకు సేవించడం వదిలేసిన 12 గంటల్లోనే మీకు చక్కని అనుభూతి కలుగుతుంది. లోతైన శ్వాస మీ సొంతమవుతుంది. రెండు రోజుల తర్వాత భోజనం ఎంతో రుచిగా అనిపిస్తుందని చెబుతున్నారు వైద్య నిపుణులు.
- ప్రతిరోజూ వ్యాయామం, ఆటలాడం వంటి వాటికి సమయం ఇవ్వాలి. ఫలితంగా మస్తిష్కం పనితీరు పెరుగుతుంది. దీని వల్ల సిగరెట్ తాగాలనే కోరిక కలగదని చెబుతున్నారు నిపుణులు.



దృఢ సంకల్పంతో..

పొగతాగడం వల్ల కొత్త జబ్బులు వస్తున్నాయి. శారీరక రోగాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యల వల్లనే చాలా మంది పొగాకుకు బానిసలవుతున్నారు. పొగాకు సేవించడం వల్ల భవిష్యత్‌లో మంచాన పడతారు. ఎన్ని విధాలుగా ప్రయత్నించినా, ఎన్ని మందులు, ఎంత మంది డాక్టర్ల సలహాలు తీసుకున్నా మార్పు రాని ఈ వ్యసనాలను దృఢ సంకల్పం అనే మందుతోనే మానడం సాధ్యమవుతుంది.

– డాక్టర్ సత్యశ్రీ, చెస్ట్ ఫిజీషియన్

సహజ రాజయోగతో విముక్తి

సహజ రాజయోగ ద్వారా వ్యసనాలకు శాశ్వత విముక్తి కలుగుతుంది. 300 ఏళ్లుగా పరిచయమైన పొగాకు, మత్తుపానీయాలు నేటి మానవ సమాజ నైతిక పతనానికి మూల కారణాలు. ప్రపంచ వాతావరణ పరిస్థితులు, మానవ సమాజ స్థితిగతులు పరిశీలించినట్టయితే వ్యసనాలు, మత్తుపదార్థాలను తక్షణమే వదిలిస్తేనే మానవజాతిని పర్యావరణ కాలుష్యం నుంచి రక్షించుకోగలుగుతాం.

– బీకే రమా, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ ప్రతినిధి

పొగాకు ఉత్పత్తుల వాడకంతో అనర్థాలు

ఆరిలోవ : పొగాకు ఉత్పత్తుల వాడడం వల్ల పలు అనర్థాలు ఏర్పడుతాయని, దీనిపై ప్రభుత్వాలు కఠినమైన చర్యలు చేపట్టాలని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ వూన్న మురళీకృష్ణ కోరారు. ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన పొగ తాగడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. పొగాకు వాడకం వల్ల దేశంలో ఏటా 1.3 మిలియన్ల మంది మరణిస్తున్నారన్నారు. ఇది శరీరంలో అన్ని అవయవాల జీవ ప్రక్రియను ప్రభావితం చేస్తుందన్నారు. క్యాన్సర్, ఉదర, హృదయం జీవ ప్రక్రియల రుగ్మతులు రావడంతో పాటు అంగవైకల్యానికి కారణమవుతుందన్నారు. పొగ తాగినవారితో పొగను పీల్చుతున్నవారు సైతం క్యాన్సర్‌కు గురవుతున్నారన్నారు. పొగాకును ఆకర్షించడానికి వాటి పరిశ్రమలు 15,000 కొత్త రుచులను సమాజంలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. భారత ప్రభుత్వం జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం ద్వారా సమాజంలో పొగాకు ప్రభావం తగ్గించడానికి ప్రభుత్వం చాలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా స్వాధీనం

పరారీలో టీడీపీ నాయకుడు


టాస్క్ ఫోర్స్ సిబ్బంది, పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణసంచా

భీమునిపట్నం (విశాఖ): అక్రమంగా బాణసంచా తయారు చేసి ఓ రేకుల షెడ్డులో నిల్వ చేయగా విశాఖ టాస్క్ ఫోర్స్ సిబ్బంది, భీమిలి పోలీసులు దాడి స్వాధీనం చేసుకున్నారు. భీమిలిలోని తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడు కొక్కిరి అప్పన్న తాళ్లవలస సమీపంలోని అక్కరమాని చిన్నమ్మకు చెందిన ఇంటి వెనుక భాగంలో ఉన్న ఒక రేకుల షెడ్డును కొద్ది నెలల క్రితం అద్దెకు తీసుకున్నాడు. ఇందులో పెద్ద ఎత్తున బాణసంచా తయారు చేసి అక్కడ నిల్వ చేశాడు. టాస్క్ ఫోర్స్ ఎస్‌ఐ భరత్‌కుమార్‌రాజు, భీమిలి పోలీస్ సీ.ఐ.రమేష్‌కు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేసి రూ.లక్ష విలువ చేసే బాంబులు, జువ్వలు, బెల్టుబాంబులు, షాట్స్‌తోపాటు మరికొంత బాణసంచా సామగ్రి స్వాధీనం చేసుకున్నారు, నిందితుడు అప్పన్న పరారిలో ఉన్నాడు. గతంలోకూడా బాణసంచా అక్రమ నిల్వలపై అప్పన్నపై కేసు నమోదైంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మారేష్(ఫైల్)

నక్కపల్లి: జాతీయ రహదారిపై ఉద్దండపురం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు. తుని మండలం కొలిమేరు గ్రామానికి చెందిన పాలెపు మారేష్ బుధవారం సాయంత్రం నక్కపల్లి మండలం డీఎల్ పురంలో ఉన్న తన అమ్మమ్మను చూడటానికి వచ్చాడు. అక్కడ గ్రామ దేవత పండగ చూసుకుని గురువారం మధ్యాహ్నం స్వగ్రామానికి బయలుదేరాడు. ఉద్దండపురం సమీపంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న మారేష్‌ను వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో మారేష్ తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

భర్తను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న మాజీ మిస్ వైజాగ్

- విడాకులు ఇవ్వకుండా వేరే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని ఆరోపణ
- మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు


నక్షత్ర, తేజల వివాహం

బీచ్‌రోడ్డు: వేరే అమ్మాయితో వివాహేతర సంబంధం పెట్టుకున్న తన భర్తను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది మాజీ మిస్ వైజాగ్ నక్షత్ర. తనకు విడాకులు ఇవ్వకుండా వేరే అమ్మాయిని పెళ్లి చేసుకొని కాపురం చేస్తున్నాడని ఆరోపిస్తూ గురువారం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. 2011 మిస్ వైజాగ్ విజేత అయిన నక్షత్ర 2013లో ఓ సినిమా షూటింగ్ సమయంలో తేజతో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వారి మధ్య స్నేహం పెరిగింది. 2017లో ఇద్దరు ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఒక పాప కూడా పుట్టింది. అయితే కొన్ని నెలల తరువాత తేజ ఇతర అమ్మాయిలతో వివాహేతర సంబంధాలు కలిగి ఉన్నట్లు గుర్తించిన నక్షత్ర అతడిని నిలదీసింది. దీంతో ఆమెను వేధింపులకు గురిచేశాడు. ఆమె 2020లో పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అతనిపై కేసు నమోదైంది. ఈక్రమంలో తేజ తనుచేస్తున్న నేవీ ఉద్యోగాన్ని కూడా కోల్పోయాడు. దీంతో ఫుల్ టైం సినిమా అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో మరింత మంది అమ్మాయిలతో వివాహేతర సంబంధాలను పెట్టుకున్నాడు. గురువారం ఒక అమ్మాయితో దసపల్లాహిల్స్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఉండగా నక్షత్ర వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉంటే నక్షత్రనే తనపై తన కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు బనాయించిందని తేజ చెబుతున్నాడు. ఆఫీసులో ఓ సినిమా విషయమై ఒక అమ్మాయితో చర్చలు జరుపుతున్న సమయంలో నక్షత్ర వచ్చి దాడి చేసిందని ఆరోపించాడు. అది ఇల్లు కాదని, ఆఫీసు అని చెప్పుకొచ్చాడు.

పెళ్లి పేరుతో మోసంపై కేసు నమోదు

పీఎంపాలెం (విశాఖ): పెళ్లి చేసుకుంటానని నమ్మించిన వ్యక్తిపై పీఎం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మారికవలస రాజీవ్ గృహకల్ప ప్రాంతంలోని ఓ అపార్టుమెంట్‌లో భర్తనుంచి విడాకులు తీసుకున్న హేమలత నివసిస్తోంది. ఆమెకు తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా ఇందిరానగర్‌కు చెందిన కొండోజు ప్రణయ్ కుమార్ అనే వ్యక్తితో డైవోర్స్ యాప్ ద్వారా పరిచయమేర్పడింది. తనకు చాలా ఆస్తులు ఉన్నాయని తనను వివాహం చేసుకుంటే జాయింట్ రిజిస్ట్రేషన్ చేయిస్తానని నమ్మబలికాడు. వివిధ కారణాలు చూపుతూ సుమారు రూ.8 లక్షలు తన పేరున బదిలీ చేయించుకున్నాడు. ఎలాగూ పెళ్లి చేసుకుంటామని కాకమ్మ కబర్లు చెబుతూ తరచూ విశాఖ వచ్చి ఆమెతో సహజీవనం చేసేవాడు. ఇలా కొన్నాళ్లు గడిచింది. తరువాత అతని ప్రవర్తనలో మార్పు వచ్చింది. వివాహ ప్రతిపాదనను తీసుకు వస్తే దాట వేసేవాడు. గట్టిగా అడిగేసరికి పెళ్లి చేసుకునేది లేదని తిరస్కరించాడు. తరువాత పూర్తిగా పట్టించుకోవడం మానేశాడు. తనకు జరిగిన అన్యాయంపై బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిన కేసులో నిందితుడు ప్రణయ్ కుమార్ అని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొందని సీఐ రామకృష్ణ తెలిపారు.

సముద్రపు కాలుష్యంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న బామిరెడ్డి

బీచ్ రోడ్డు (విశాఖ): సముద్రపు కాలుష్యం మత్స్య జీవరాసులపై తీవ్ర ప్రభావం చూపుతుందని భారతీయ మత్స్య పరిశోధన సంస్థ ముఖ్య అధికారి డి.బామిరెడ్డి తెలిపారు. గురువారం బీచ్‌రోడ్డులోని భారతీయ మత్స్య పరిశోధన సంస్థలో సముద్రపు కాలుష్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోస్ట్ ఫిషింగ్, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల సాగర జలాలు కలుషితం అవుతున్నాయన్నారు. తద్వారా మత్స్య సంపద తగ్గతుందన్నారు. ఈ కాలుష్యన్ని నియంత్రించేందుకు మత్స్యకారులు తమ వంతు కృషి చేయాలన్నారు. అనంతరం సముద్రం కాలుష్యం వల్ల కలిగే నష్టాలను వీడియోల రూపంలో ప్రదర్శించారు. నూతన మెరైన్ మ్యూజియంను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సైంటిస్ట్ ఇన్‌చార్జి డాక్టర్ యు.శ్రీధర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.ప్రసాద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

యూత్‌ను ఆకట్టుకున్న 'డర్టీఫెలో'

చిత్ర హీరో శాంతిచంద్ర


సీఎంఆర్ సెంట్రల్‌లో హీరో శాంతిచంద్ర, హీరోయిన్లు నమ్రిత, దీపికాసింగ్

మద్దిలపాలెం (విశాఖ): మాఫియా మెడలు వంచే కథాంశంతో జి. భద్రకాళి సమర్పణలో రాజ్ ఇండియా ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దర్శకుడు ఆడారి మూర్తి తెరెక్కించిన డర్టీఫెలో చిత్రాన్ని యువత విశేషంగా ఆదరిస్తున్నారని చిత్ర హీరో శాంతిచంద్ర అన్నారు. మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లోని ఐనాక్స్ థియేటర్‌లో గురువారం చిత్ర యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా శాంతిచంద్ర మాట్లాడుతూ ఈ నెల 24న చిత్రం విడుదలైందన్నారు. రోజురోజుకూ ప్రేక్షకాదరణతో దూసుకుపోతోందన్నారు. విశాఖ అందాల నడుమ ఈ చిత్రాన్ని తెరకెక్కించామని చెప్పారు. యాక్షన్, రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుందన్నారు. దర్శకుడు మూర్తి మాట్లాడుతూ చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. హీరోయిన్ నమ్రిత, దీపికాసింగ్ పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

- వైభవంగా స్వర్ణ పుష్పార్చన
- శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం


స్వర్ణ పుష్పాలతో స్వామికి పూజ చేస్తున్న అర్చకుడు


నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా నిత్య కల్యాణం..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం 9.30 గంటల నుంచి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడా మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం జరిపించారు. ఉభయదాతలకు అర్చకులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

పోస్టల్ బ్యాలెట్‌పై ఈసీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి



అనకాపల్లి: కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా పోస్టల్ బ్యాలెట్‌లో గెజిటెడ్ అధికారి సంతకం లేనప్పటికీ అనుమతించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కొత్త నిబంధన పెట్టడం హాస్యాస్పదంగా ఉందని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో సాక్షితో ఆమె మాట్లాడారు. ప్రతిపక్షాలకు మేలు చేసే విధంగా ఎన్నికల కమిషనర్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విద్యావంతులైన ఉద్యోగులు నిబంధనలు పాటించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు.

పర్యావరణ మార్పులపై సెప్టెంబర్‌లో సదస్సు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సముద్ర అధ్యయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'వాతావరణ మార్పు అధ్యయనాలకు సంబంధించి వాతావరణ సముద్ర ప్రక్రియల్లో ప్రస్తుత పోకడలు అంశంపై జాతీయ సదస్సును సెప్టెంబర్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సముద్ర అధ్యయన శాస్త్ర విభాగం సెప్టెంబర్‌లో ప్లాటినం జూబ్లీ వేడుకలను జరుపుకోనుంది.

ప్రమాదవశాత్తూ బావిలో పడి ఆటోడ్రైవర్ మృతి


బావిలో పడి మృతి చెందిన వెంకటరావు


వెంకటరావు చావుకు కారణమైన బావి

కె.కోటపాడు: స్థానిక మెయిన్‌రోడ్డు సమీపంలో వాడుకలో లేని బావిలో ప్రమాదవశాత్తూ జారిపడి కె.కోటపాడుకు చెందిన ఆటోడ్రైవర్ భర్ల రమణ(50) గురువారం రాత్రి మృతిచెందాడు. వివరాలు. మెయిన్‌రోడ్డు సమీపంలో ఉన్న బావి ప్రాంతంలో ఫోన్ మాట్లాడుతున్న రమణ బావిని గుర్తించక దానిలో పడిపోయాడు. దీంతో స్థానికులు గుర్తించి అతన్ని రక్షించేందుకు ప్రయత్నించారు. సుమారు 30 నుంచి 40 అడుగుల లోతుగల బావిలో బురద ఎక్కువగా ఉండడంతో పాటు బావిలో పడిన సమయంలో ఆయన తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. రమణను రక్షించేందుకు స్థానికులు ఎంతగా ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో చోడవరం అగ్నిమాపక సిబ్బందిని రప్పించి వారి సాయంతో రమణను బయటకు తీశారు. అయితే అప్పటికే రమణ మరణించాడు. మృతుని కుమారుడు చిన పెద్దినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.కోటపాడు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు. మృతునికి భార్య సీత, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

క్లుప్తంగా

నిబంధనలు పాటించని వాహనాలపై కేసులు



అచ్యుతాపురం రోడ్డులో వాహనాలపై కేసులు నమోదు చేస్తున్న ఆర్టీవో ప్రకాష్

తుమ్మపాల: నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై ఓవర్‌లోడ్‌తో ప్రయణించే వాహనాలపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని జిల్లా రవాణా శాఖ అధికారి కె.వి.ప్రకాష్ అన్నారు. పట్టణంలో అచ్యుతాపురం రోడ్డుపై గురువారం రవాణా శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అధిక సంఖ్యలో వాహనాలకు జరిమానాలు విధించారు. రెండు రోజులుగా చేపట్టిన డ్రైవ్‌లో రూ.10 లక్షల వరకు జరిమానాలు వేశామన్నారు. అనకాపల్లి -అచ్యుతాపురం రహదారిలో పరిమితికి మించి వాహనాలు అధిక బరువుతో రాకపోకలు చేస్తున్నాయన్నారు. అలాంటి వాహనాలపై జరిమానాలు వేస్తున్నామని, వారిలో మార్పు రాకపోతే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సత్వరం రహదారి పూర్తి చేయాలి

అనకాపల్లి : స్థానిక జలగల మదుం జంక్షన్ పెట్రోల్‌బంక్ వద్ద రహదారిని త్వరితగతిన పూర్తిచేసేందుకు జీవీఎంసీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సిద్ధార్థా సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో కోరారు. జీవీఎంసీ అధికారులు రెండు లైన్లు రహదారిని పట్టణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని నాలుగులైన్లు రహదారిగా విస్తరించడం శుభపరిణామమని, అనకాపల్లి నుంచి జాతీయ రహదామీదుగా విశాఖకు వెళ్లే సమయంలో పెట్రోల్ బంకు వద్ద రహదారి వేయకపోవడంతో పెద్దపెద్ద గోతులతో భారీ వాహనాలు, బస్‌లు, కారులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాహనాలు మరమ్మతులకు గురౌవుతున్నాయని, వర్షాలు కురవకుముందే రహదారిని అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: కశింకోటలోని వారపు సంతలో గురువారం కూరగాయలు దాదాపు స్థిర ధరలకు అమ్మకాలు సాగాయి. కిలో ఉల్లిపాయలు, బంగాళాదుంపలు రూ.30, టమాటా, దొండకాయ, బీట్రూట్, క్యారెట్, బెండకాయ, వంకాయ రూ.40, బీరకాయ, కాకరకాయ, కీరదోస రూ.60కి విక్రయాలు సాగాయి.

అనకాపల్లి సినిమాలు

గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి	: రాజా
గం గం గణేశా	: సత్యనారాయణ స్క్రీన్-1
తాన్‌వే	: షిర్డిసాయి
హిట్ లిస్ట్	:షిర్డిసాయి
రాజుయాదవ్	: వెంకటేశ్వర
బాక్	: శ్రీసత్య
భజే వాయు వేగం	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 314 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,670	5,200
మొదటి రకం	4,600	4,930
రెండో రకం	4,030	4,600
మూడో రకం	3,600	4,060

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 49 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-30 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 346 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 259 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(0892 4223595)ని సంప్రదించవచ్చు.

'చేయూత' అందింది...

- నాలుగో విడతలో రూ.34 కోట్లు జమ
- స్వయం ఉపాధి దిశగా మహిళలు
- నియోజకవర్గంలో మహిళలకు అందిన నగదు రూ.116.92 కోట్లు



చేయూత పొందిన మహిళలు (ఫైల్)

తుమ్మపాల : సంక్షేమ పథకాలు ప్రజల జీవనస్థితిగతులను మెరుగుపరుస్తున్నాయి. ప్రభుత్వం ద్వారా వివిధ రూపాల్లో ప్రజలు పొందిన నగదు వారి జీవనోపాధికి మూలాలుగా మారాయి. గడిచిన ఐదేళ్లలో స్వయం సహాయక రంగాల్లో మహిళలు పరిపుష్టి సాధించారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వడ్డీ దోపిడీల నుంచి విముక్తి పొందారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండతో సమాజంలో మహిళలు కుటుంబ ఆర్థిక బాధ్యతలు కూడా నిర్వహించే స్థాయిలో నిలుస్తున్నారని సగర్వంగా చెబుతున్నారు. ఎందరో మహిళలు చిరువ్యాపారులుగా, స్వయం సహాయక వ్యాపార బృందాలుగాను, చేయూత మార్ట్‌ల ఏర్పాటుతోను, వ్యవసాయం, పాడిపరిశ్రమ ఏర్పాటుతోను, కిరాణా, దుస్తులు, 1గ్రామ్ జ్యూయలరీ, చిరుతిళ్లు దుకాణాలు, మిల్లెట్స్ వ్యాపారాల్లో నిలదొక్కుకుని తమ ప్రతిభతో దూసుకుపోతున్నారు.

నాలుగు విడతల్లో రూ.116.92 కోట్లు

నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెంది, 45 ఏళ్ల దాటిన 18,419 మందికి నాలుగో విడత వైఎస్సార్ చేయూత పథకం ద్వారా దాదాపు రూ.34 కోట్ల నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు. దీంతో మొత్తం నాలుగు విడతల్లో కలిపి రూ.116.92 కోట్లు నగదును జగన్ ప్రభుత్వం జమ చేసి మహిళల ఆర్థికవృద్ధికి బాటలు వేసింది. మొదటి విడతలో రూ.24.27 కోట్లు, రెండో విడతలో రూ.26.86 కోట్లు, మూడో విడతలో రూ.31.53 కోట్లు ప్రభుత్వం జమ చేసింది.

నియోజకవర్గంలో నాలుగో విడత లబ్ధిదారుల వివరాలు

మండలం	దరఖాస్తుదారులు	లబ్ధిదారులు,	జమ అయిన నగదు
అనకాపల్లి	6,689	6,532	రూ.12,24,75,000
కశింకోట	6,111	6,006	రూ.11,26,12,500
అనకాపల్లి జీవీఎంసీ	5,776	5,633	రూ.10,56,18,500
మొత్తం	18,576	18,171	రూ.34,07,06,000

వివిధ విడతలుగా విడుదలైన వైఎస్సార్ చేయూత నగదు (కోట్లలో)

మండలం	1వ విడత,	2వ విడత,	3వ విడత,	4వ విడత
అనకాపల్లి	08.22	09.28	11.33	12.24
కశింకోట	08.47	09.20	10.64	11.26
అనకాపల్లి టౌన్	07.78	08.38	09.56	10.56
మొత్తం	24.47	26.86	31.53	34.06

మహిళా పక్షపాతిగా సీఎం జగన్

కుటుంబం వృద్ధికి మహిళే మూలం, మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటే కుటుంబం ఆర్థికంగా బాగుపడుతుందని నమ్మి సీఎం జగన్ మహిళలకు నవరత్నాలు అందించారు. ప్రతి పథకాన్ని మహిళలకే అందిస్తూ వస్తుంది. నవరత్నాలు-పేదలందరికీ సంక్షేమ అనే నినాదంతో రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను వరాలుగా అందించారు. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా పేద కుటుంబాలకు చెందిన బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనారిటీల్లో అర్హత కలిగిన మహిళలకు ఏటా రూ.18,750 ప్రభుత్వం అందించింది. వాటితో వృత్తి పనులు, వ్యాపార అభివృద్ధి చేసుకుంటూ మహిళలు ఆర్థికంగా స్థిరపడ్డారు.

అప్పులు లేకుండా జీవిస్తున్నాను



నా జీవనాధారం నా పాన్‌షాప్, కొన్నేళ్లుగా చిరుతిళ్లతో వ్యాపారం చేసుకుంటూ వస్తున్నాను. గతంలో సామాగ్రి కొనడానికి నగదు చాలకపోతే వడ్డీ వ్యాపారులను నుంచి అప్పు తీసుకుని వ్యాపారం చేయాల్సి ఉండేది. వచ్చిన లాభం వడ్డీకే సరిపోయేది. గడిచిన ఐదేళ్లుగా సీఎం జగన్ నాకు ఏడాదికి రూ.18,750 పంపిస్తున్నాడు. వైఎస్సార్ చేయూత ద్వారా వస్తున్న ఈ నగదు నాకు ఎంతగానో సహాయపడింది. ఎన్నికల వచ్చాయి కాబట్టి ఈ ఏడాది నగదు రాదని కొందరు ప్రచారం చేశారు. అయినా సరే సీఎం జగన్ మాలాంటి వారికి ఇచ్చిన మాట నెలబెట్టుకున్నారు. ఆలస్యంగానైనా నగదు జమ చేశారు. ఈ డబ్బుతో సామాన్లు కొనుగోలు చేసుకున్నాను. ఇప్పుడు ఎటువంటి అప్పులు లేకుండా వ్యాపారం చేసుకుంటున్నాను. నా జీవనోపాధికి భరోసాగా చేయూత నిలిచింది.

– శరగడం సూరికాంతం

పాన్‌షాప్ పెట్టుకున్నాను



జగనన్న ప్రభుత్వంలో నాకు వైఎస్సార్ చేయూత పథకంలో ఏడాదికి రూ.18,750 చొప్పున అందింది. నాకు మూడేళ్లుగా వచ్చిన మొత్తం రూ.56 వేలు వచ్చింది. వీటితో పాటు నవరత్నాలు పథకంలో అందుతున్న సహాయంతో ఫ్యాన్సీ వస్తువుల విక్రయం చేస్తున్నాను. వైఎస్సార్ చేయూతతో వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం డీఆర్డీఏ ద్వారా అజియో బ్రాండెడ్ దుస్తులను నాకు అందిస్తున్నారు. చీరలు, పంచెలు, బట్టలు అన్ని వస్తువులను నా షాపులో విక్రయిస్తున్నాను. మా గ్రామంలో రోజుకు కనీసం రూ.15 వందల నుంచి రూ.2 వేల వరకు వ్యాపారం చేస్తున్నాను. ఎటువంటి చింత లేకుండా మా కుటుంబంతో చాలా సంతోషంగా జీవిస్తున్నాం.

–మళ్ల గిరిజాభవానీ

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



తాళ్లపాలెం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పద్యాలు చదువుతున్న బాలిక

కశింకోట : విద్యార్థులు గ్రంథాలయ పఠనం అలవర్చుకోవాలని నర్సీపట్నం విశ్రాంత గ్రంథాలయ అధికారి జి.మురళీకృష్ణ కోరారు. తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలతోపాటు గ్రంథాలయాలకు కూడా తీరిక సమయాల్లో వచ్చి పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు చదివి వినిపించారు. తెలుగు పద్యాలు-భావం, వ్యతిరేక పదాలు, సామెతలు వగైరా పిల్లలతో పలికించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

మురుగు కాల్వల్లో పూడికతీత



డ్రైనేజీ మట్టిని తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

అనకాపల్లి : మేలుకోకుంటే...మురుగు ముంపు తప్పదు శీర్షికన ఈనెల 23న సాక్షి పత్రికలో కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించి, పారిశుధ్య సిబ్బంది ద్వారా దశల వారిగా జోన్ పరిధిలో డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టారు. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకుని ఉదయం, సాయంత్రం సమయంలో కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. ఇదే క్రమంలో తాజాగా గురువారం వేల్పులవీధి పార్కు సెంటర్ వద్ద డ్రైనేజీ పూడిక మట్టిని తొలగించారు.

విజయోత్సవాలకు సిద్ధంగా ఉండండి

- 9న మళ్లీ సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారం ఖాయం
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశంలో మలసాల భరత్‌కుమార్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



సమావేశానికి హాజరైన కశింకోట మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అనకాపల్లి : ప్రశాంతమైన వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయని, జూన్ 4న ఫలితాల్లో విజయఢంకా మోగించి మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ కేంద్రంగా ప్రయాణ స్వీకారం చేయం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను 12వేల మెజార్టీతో గెలుపు ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో కశింకోట మండల పార్టీ అధ్యక్షుడు మలసాల కిషోర్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన తరువాత తమ సొంత పనులు నిమిత్తం హైదరాబాద్ వెళ్లడం జరిగిందని, ప్రతిపక్షాలు ఎన్నో విమర్శలు చేసినప్పటికీ కార్యకర్తలు ధైర్యంగా వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి చేశారన్నారు. రాజకీయ కుటుంబ చరిత్ర కలిగిన తనను నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించారని పేర్కొన్నారు. జనవరి 2వ తేదీ నుంచి నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు అండగా ఉండడంతో గడప గడపకు సార్వత్రిక ఎన్నికల్లో ప్రచార కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, ఎన్నికల ఫలితాలు విడుదలైన వెంటనే మరోసారి నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి వ్యక్తికి గుర్తింపు ఉంటుందని, జూన్ 4న రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో విజయోత్సవాలకు పార్టీశ్రేణులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపు నిచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని, మహిళలు, వృద్ధులు, యువత సైలెంట్‌గా పోలింగ్ భూత్‌ల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని ఆశీర్వదించినట్టు చెప్పారు. జూన్ 9న విశాఖ కేంద్రంగా మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రయాణస్వీకారం చేస్తున్నారని, నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మీగున్నయ్యనాయుడు, జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరక సోమునాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, విశాఖ డెయిరీ డైరెక్టర్ రమణారావు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం



స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కోటేశ్వరరావు

అనకాపల్లి : పట్టణ, మండలంలో పలు ప్రాంతాల్లో సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం జరిగాయి. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, వివేకానందనగర్ సీఐటీయూ కార్యాలయంలో వద్ద ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 1970లో సీఐటీయూ ఏర్పడిందని నేటికి 54 సంవత్సరాలుగా కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నామని, దేశంలో కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ కాలంలో దేశ వ్యాప్తంగా 15 సమ్మెలు నిర్వహించామని, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా పోరాడామని, సీఐటీయూని మరింత బలోపేతం చేసే అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్ పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, నాయకులు పి.ఎస్.వి.పరమేశ్వరరావు, గంటా శ్రీరామ్, బోడి రాజు, వెంకట అప్పారావు, పలక సత్యనారాయణ పాల్గొన్నారు.

మండే ఎండలకు 'ఉక్క'రిబిక్కిరి

- పట్టణంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత
- అల్లాడుతున్న జనం



రామచంద్ర థియేటర్ వద్ద నిర్మానుష్యంగా అనకాపల్లి-చోడవరం రహదారి

అనకాపల్లి : పట్టణ వాసులు అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారు. గురువారం అనకాపల్లి పట్టణంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. బయటకు రావాలంటేనే ప్రనజలు భయపడుతున్నారు. వేడిగాలులు ఎక్కువగా వీయడంతో ఇళ్లల్లో ఫ్యాన్లు కింద నివసించే ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. ఏసీ ఉన్నగృహాలకు కొంతమేరకు ఉపసమనం కలిగింది. ఉదయం 8.30 గంటల నుంచి భానుడు తన ప్రతాపం చూపడంతో తెల్లవారుజామున గ్రామీణ ప్రజలు పట్టణానికి వచ్చి తిరిగి వెళ్లే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు వారివారి కార్యాలయాల్లో ఏసీలో ఉండి బయటకు రావాలంటే భయపడ్డారు. ఏసీలు, ఫ్యాన్లు ఎక్కువగా వాడడం వల్ల పలు ప్రాంతాల్లో అధికలోడ్‌కు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజులు పోయాయి. వేడిని లెక్కచేయకుండా విద్యుత్‌శాఖ ఉద్యోగులు మరమ్మతులు పనులు చేపట్టారు. చిరువ్యాపారులు అధిక ఉష్ణోగ్రతల కారణంగా సాయంత్రం 6 గంటల తరువాత రహదారులపైకి వచ్చారు. కూల్‌డ్రింక్స్, ఫ్రూట్‌జూస్, ఐస్‌క్రీమ్‌ల వ్యాపారం జోరుగా సాగింది.

కశింకోటలో కార్డన్ సెర్చ్



కశింకోటలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు, కారు



కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు సిబ్బంది

కశింకోట: కశింకోటలో సరైన రికార్డులు లేని 46 బైకులను, కారు, ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ ఎం. వినోద్‌బాబు, ఎస్ఐ రమేష్ బాబు, అలీల ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామంలోని గవరపేట, హౌసింగ్ కాలనీ, జాషువా కాలనీ, ఎస్సీ కాలనీ, సత్తెమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఆ సమయంలో సరైన రికార్డులు లేని బైక్‌లను, కారు, ఆటో స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌లో భద్రపరిచారు. వీటికి రికార్డులు ఉంటే ఆధారాలు చూపి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా సీఐ కోరారు. ఇళ్ల ముందు పెట్టే బైక్‌లు దొంగతనాలకు గురి కాకుండా వాటికి పటిష్టవంతంగా లాక్‌లు వేసుకొని భద్రపరచుకోవాలని వాహన చోదకులకు సూచించారు.

విజయాంజనేయ స్వామి జయంత్యుత్సవం రేపు



రంగులు వేసిన స్వామివారి విగ్రహం

మాడుగుల: స్థానిక గాంధీ పార్కు వద్ద కొలువైన విజయాంజనేయ స్వామి జయంత్యుత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరగనుందని ఆలయ కమిటీ గురువారం తెలిపింది. స్వామివారి విగ్రహానికి రంగులు వేశారు. నగలతో అలంకరించారు. ఉత్సవం సందర్భంగా 42 పర్యాయాలు హనుమాన్ చాలీసా సంకీర్తన, భజన కార్యక్రమాలతోపాటు, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు. మండలంలోని భక్తులంతా వచ్చి, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

ఆర్బీకేల్లో వరి విత్తనాలు సిద్ధం



దేవరాపల్లి ఆర్బీకేలో విత్తనాల బస్తాలను పరిశీలిస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)లకు ప్రభుత్వం సరఫరా చేసిన ఖరీఫ్ వరి విత్తనాలను మొలక శాతం ఆధారంగా నాణ్యతను పరిశీలించినట్లు మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ తెలిపారు. మండలంలోని దేవరాపల్లి సహా పలు ఆర్బీకేల్లోని విత్తనాలను, రికార్డులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సీజన్‌కు దేవరాపల్లి మండలంలోని 20 ఆర్బీకేల పరిధిలోని రైతులకు 1,350 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని, ప్రస్తుతం 16 ఆర్బీకేలకు 1,050 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉంచామన్నారు. మిగిలిన ఆర్బీకేలకు విత్తనాలు త్వరలోనే వచ్చేస్తాయన్నారు. సోనామసూరి 42 క్వింటాళ్లు, సాంబ మసూరి 160 క్వింటాళ్లు, అమర్ 113 క్వింటాళ్లు, శ్రీధృతి 383 క్వింటాళ్లు, మార్టేరు సాంబ 119 క్వింటాళ్లు, స్వర్ణ 89 క్వింటాళ్లు, శ్రీకాకుళం సన్నాలు 360 క్వింటాళ్లు, ఆర్ఎన్ఆర్ 4 క్వింటాళ్లతో పాటు అధునాతన వంగడాలు మరో 75 క్వింటాళ్లు వచ్చాయన్నారు. వరి నారు మడులను దుక్కు చేసి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయ విస్తర్ణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్, ఆర్బీకే ఇన్‌చార్జ్‌లు కె.సత్యారావు, డి.వరుణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

మహిళలకు ఉచిత టైలరింగ్, బ్యూటీపార్లర్ శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న శచీదేవి

అనకాపల్లి : మహిళలు స్వశక్తితో ఎదగాలని, ఆర్థికంగా బలపడితే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి అన్నారు. స్థానిక పూడిమడక రహదారి భారతీయ స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ డ్వాక్రా గ్రూపు సంఘాలలో చేరాలని తద్వారా శిక్షణ అనంతరం యూనిట్ స్థాపించుకోవడానికి తగిన ఆర్థిక సహాయం ద్వారా డ్వాక్రా రుణం పొందవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ప్రైవేట్ ఉద్యోగాల ఒత్తిడి కారణంగా స్వయం ఉపాధి అనేది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. మహిళలకు అర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. సంస్థ డైరెక్టర్ బి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ టైలరింగ్, బ్యూటీపార్లర్ శిక్షణ 30 రోజులు ఉంటుందని, శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, రెండు జతల యూనిఫాం, టూల్‌కిట్స్, బ్యాంక్‌ల ద్వారా రుణాలు, పర్సనల్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ డైనీ, మహిళలు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాల్లోనే పింఛను జమ

- 3,008 మందికి ఇంటి వద్ద పంపిణీ

మాడుగుల రూరల్: అవ్వతాతలకు ప్రతి నెల అందించే పింఛన్లు ఈ నెల్లో కూడా బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్లు స్థానిక ఎంపీడీవో ఆర్.కాళీప్రసాదరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11,929 మంది పింఛనుదార్లకు గాను రూ.3.58 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. ఇందులో 3,008 మంది వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు, దివ్యాంగులు, వీల్‌చైర్‌కి పరిమితమైన వారికి రూ.90.21 లక్షల నగదును 5వ తేదీలోగా సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందిస్తారని తెలిపారు. మిగిలిన 8,921 మందికి సంబంధించి రూ.2.68 కోట్లను జూన్ 1న పింఛనుదార్ల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.

చిటిక వ్యాధి నివారణకు టీకాలు



టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

మాడుగుల: ప్రస్తుత సీజన్లో పశువులు చిటిక వ్యాధి బారిన పడకుండా ముందు జాగ్రత్తగా మేకలు, గొర్రెలకు టీకాలు వేయించాలని పాడేరు డివిజన్ ఉపసంచాలకులు సీహెచ్ నరసింహులు సూచించారు. గురువారం మండలంలోని సత్యవరం, గొటివాడ అగ్రహారం గ్రామాల్లో నిర్వహించిన టీకాల కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. మండలంలో 6,540 మేకలు, గొర్రెలకు టీకాలు వేయాల్సి ఉండగా 340 మేకలకు ప్రస్తుతం వేసినట్లు వెల్లడించారు. మిగిలిన వాటికి కూడా వీలైనంత వేగంగా టీకాలు వేస్తామన్నారు.